వేతనాలకు ఎదురుచూపులు

- రెండు నెలల 15 రోజులుగా అందని వేతనాలు
- రూ.4.22 కోట్ల బకాయిలు
- ఉసూరుమంటున్న ఉపాధి కూలీలు


కాజులూరు పంట కాలువలో పూడిక తొలగిస్తున్న ఉపాధి కూలీలు


ఉపాధి కూలీలకు జీతాలు విడుదల చేయాలంటూ శీలలో ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు (ఫైల్)

కాజులూరు: రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉపాధి కూలీలది. ప్రతి రోజూ పనిచేసి సమయానుకూలంగా కూలీ డబ్బులు చేతికందితేనే గుక్కెడు బువ్వ నోటిలోకి వెళ్లేది. కాజులూరు మండల గ్రామాల్లో నిరుపేదలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కడుపు నింపని పరిస్థితి కనిపిస్తోంది. ఉపాధి లభిస్తున్నా నిర్ణీత సమయానికి వేతనాలు విడుదల కాక ఉపాధి కూలీలు ఎదురు చూస్తున్నారు. కాజులూరు మండలంలో 6500 కుటుంబాలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నాయి. వీరి ఉపాధికి ఏటా వంద రోజుల పాటు పని కల్పించి, నిర్ణీత గడువులోగా వేతనాలు చెల్లించవలసి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు, పంటబోదెలలో పూడికతీత పనులు, రోడ్డు పక్కన తుప్పల తొలగింపు చెరువుల తవ్వకం తదితర పనులు నిర్వహించారు. ఏప్రిల్ నుంచి మే రెండు నెలలు కాజులూరు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 1,214 పనుల ద్వారా 1,45,575 పని దినాలు కల్పించారు. ఏప్రిల్ నుంచి మే 31 వరకు 61 రోజులకు వేతనాల్లో రూ.42 కోట్ల 22 లక్షల 16 వేల వేతనాల పెండింగ్ ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా కూలీలకు చెల్లించలేదని కూలీలు చెబుతున్నారు. ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. ఉపాధి కూలీలకు జీతాలు చెల్లించకపోవడంపై వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి కెఎస్ శ్రీనివాసులు, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు ఇటీవల మండల గ్రామాల్లో పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. జూన్ నెలలో 15 రోజులు గడచినా వేతనాల చెల్లింపు ఊసే ఈ ప్రభుత్వానికి లేదన్నారు. కూలీల వేతనాలు ఎప్పుడు విడుదల అవుతాయో ఉపాధి హామీ అధికారులు చెప్పలేకపోతున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాష్ట్రానికి చేరాయని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉపాధి నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో మాకు తెలియదంటున్నారు. కేంద్రం నుంచి విడుదల చేసిన ఉపాధి నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా తాత్సారం చేస్తుందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

గత ఏడాది కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలను నిర్ణీత సమయానికి చెల్లించడంలో విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది కూడా గత ఏడాది మాదిరిగానే ఉపాధి కూలీల వేతనాలను ఆలస్యం చేసింది. రెండు, మూడు నెలల పాటు వేతనాలు ఇవ్వకపోతే మా జీవితాలు ఎలా ముందుకు సాగేదని ఉపాధి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. దీనిపై ఉపాధి ఏపీఓ వెంకటలక్ష్మిని వివరణ కోరగా నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. నిధులు విడుదలైతే వేతనాలు వారి బ్యాంక్ ఖాతాలకు జమవుతాయని తెలిపారు.

పది వారాలుగా వేతనాలు లేవు



ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పది వారాల పాటు పని చేశాం. ఈ రెండు నెలల 14 రోజుల కాలంలో ఒక్క రూపాయి కూడా కూలి డబ్బు ఇవ్వలేదు. పది వారాలకు ఒక్కొక్కరికి సుమారు రూ.12 నుంచి 17 వేల వరకు కూలీ డబ్బు రావాల్సి ఉంది. అధికారులను అడుగుతుంటే త్వరలో రిలీజ్ అవుతాయని చెబుతున్నారు.

– నురుకుర్తి శ్రీనివాసరావు, తర్లంపూడి

ఉపాధి వేతనాలు చెల్లించాలి



ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహించి రెండు నెలలు పైబడినా నేటికీ వేతనాలు ఇవ్వలేదు. ఉపాధి పథకంపై ఆధార పడుతున్న నిరుపేద కుటుంబాలకు వేతనాలు జమ కాక ఆర్థిక భారంగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే ఉపాధి వేతనాలు విడుదల చేయాలి.

– ద్వారంపూడి వెంకటరెడ్డి, బందనపూడి

క్లుప్తంగా

ఆర్టీసీ డిపో తనిఖీ


రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సౌకర్యాల గురించి ప్రయాణికులను అడుగుతున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం రూరల్: జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ రావిరాల ఆదేశాల మేరకు రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల శుక్రవారం రామచంద్రపురం ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. బస్సు కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవలు, శుభ్రత, క్యాంటీన్, షాపుల్లో అమ్మే తినుబండారాల నాణ్యత, ధరలు, టాయిలెట్స్ నిర్వహణ, టూ వీలర్ పార్కింగ్ సదుపాయం, చార్జీలు తదితర అంశాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించడమే కాకుండా ప్రయాణికులను నేరుగా అడిగి వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లను అందిస్తున్న ఎంఈఓ నాగరాజు తదితరులు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లను ఎంఈఓ నాగరాజు, హెచ్ఎం వెంకటేశ్వరరావు విద్యార్థులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల బరువును తగ్గించేందుకు ప్రత్యేకంగా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల పుస్తకాలు సెమిస్టర్ వారీగా ఒకే పుస్తకంగా ముద్రించి అందజేశారు. ఇప్పటికే పాఠశాలలో 75 శాతం మంది విద్యార్థులకు కిట్లను అందించామని సోమవారం నాటికి 100 శాతం కిట్లను అందిస్తామని వారు పేర్కొన్నారు. విద్యా కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, టెస్ట్‌బుక్ కోఆర్డినేటర్ ఏడుకొండలు, సీనియర్ ఉపాధ్యాయులు పితాని శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: మండలంలోని పెనుమళ్లలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో సరైన డంపింగ్ యార్డు సదుపాయం లేకపోవడంతో స్థానికులు గృహావాసాల్లోన్ని చెత్తా చెదారం గ్రామ ముఖద్వారంలోని రోడ్డుపక్కన పారవేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో రోడ్డుపక్కన పారవేసిన చెత్తకుప్పలు రోడ్లపైకి పొల్లుకు వస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసనలు వస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్లు అధ్వానంగా తయారై పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారవుతుందని దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

చైర్‌పర్సన్ మాటల్లో వాస్తవం లేదు

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో మహిళలపై కూటమి ప్రభుత్వంలో అఘాయిత్యాలు పెరిగిపోయాయని మీడియా సమావేశంలో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి చేసిన విమర్శలపై పట్టణ టీడీపీ మహిళా కౌన్సిలర్లు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం 4,10,11,12,17,21,22 వార్డుల కౌన్సిలర్లు గుండు రామతులసి, శిరంగి జ్యోతి, కొవ్వాడ బేబి, మలసాని సీతామహాలక్ష్మి, కాళ్ళకూరి స్వరాజ్య భవాని, చింతలపూడి దుర్గ, బొక్కా సరస్వతి మాట్లాడుతూ నివేదికలు చూసి మాట్లాడాలని ఆమెకు సూచించారు.

అధ్వానంగా రహదారులపై చెత్త

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని పలు రహదారులపై అధ్వానంగా చెత్త పేరుకుపోయింది. రహదారుల కూడళ్లలో చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. తొలకరి చినుకులు పడుతుండటంతో ఆ ప్రాంతం అధ్వానంగా దర్శనమిస్తోంది. దీనితో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డంపింగ్ యార్డు లేక చెత్తను గ్రామ శివారు ప్రదేశాల్లో వేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామ వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు గ్రామానికి డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

రాయవరం: విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీలు అందజేశారు. సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పొడగట్లపల్లి వీరబ్రహ్మం, కో–ఆప్షన్ సభ్యులు సత్తి భామిరెడ్డి, స్థానిక నేతలు మేడపాటి రవీంద్రరెడ్డి, కోడి చినఅప్పారావు, గండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గొప్పిరేవు వంతెనపై ట్రాఫిక్ అంతరాయం


ద్వారపూడి-యానాం రహదారిలో గొప్పిరేవు వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు వంతెనపై శుక్రవారం వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మండలంలోని ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు, పల్లిపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో అనధికార మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు పొలాల్లోని మట్టి దిమ్మలను ట్రాక్టర్లపై యానం తదితర ప్రాంతాలలోని రియల్‌ఎస్టేట్ లే అవుట్లకు, ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో యానం వైపునకు ధాన్యం లోడుతో వెళుతున్న లారీని యానం నుంచి ద్రాక్షరామ వైపునకు వస్తున్న మట్టి ట్రాక్టరు ఢీకొనటంతో రెండు వాహనాలు గొప్పిరేవు వంతెనపై నిలిచిపోయాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు అవకపోయినప్పటికీ ఇద్దరు డ్రైవర్లు వాహనాలను మధ్యలో వదలివేసి తప్పునీదంటే, నీదంటూ ఘర్షణకు దిగటంతో రహదారిపై ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక యువకులు కలగజేసుకుని ఇరువురికీ సర్దిచెప్పి ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అన్ని రంగాల్లో కూటమి విఫలం

- ఏడాదిలో ఒరగబెట్టింది ఏమీ లేదు
- సామాన్యులకు వైద్యం దూరం
- కూటమి విజయోత్సవాలు హాస్యాస్పదం


మండపేటలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): ఏడాది పాలనాకాలంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ పూర్తిగా విఫలమైందని, సామాన్య ప్రజలకు చేసింది ఏమీ లేకపోయినా కూటమి నేతలు విజయోత్సవం పేరుతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రెడ్డి రాధాకృష్ణలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు.

తప్పుడు ప్రచారం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏడాదికాలం పాటు అమలు చేయలేదన్నది ప్రజలకు తెలుసన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై వ్యతిరేకతతో వైఎస్సార్ సీపీ ఓడిపోయిందంటూ కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడంతో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాకా ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి కల్లబొల్లి కబుర్లతో కాలం గడుపుతుందన్నారు. పేదలకు ఎంతగానో ఉపకరించే ఆరోగ్యశ్రీని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. మండపేట పట్టణం జనావాసాల్లో మద్యం షాపులను ఏర్పాటు చేసేందుకు అనుమతులిచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమా అని ప్రశ్నించారు.

ఆవాసాల చెంతన మద్యం షాపులు

మహిళల కడగండ్లకు కారణాలయ్యే మద్యం షాపులు, బెల్ట్ షాపులను నడుపుతున్నందుకు విజయోత్సవాలు చేసుకుంటున్నారా అని దుయ్యబట్టారు. మహిళలకు ఉచిత బస్సు ఏమైందని, ఇళ్ల స్థలాలు, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అమలు చేసేశారని విజయోత్సవం చేసుకుంటున్నారా అని ఎద్దేవా చేశారు. అములు చేసేశామని చెప్పుకుంటున్న ఉచిత గ్యాస్, తల్లికివందనం అమలు ఏపాటిదో ప్రజలకు తెలుసన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 87.43 లక్షల మందికి రూ.10 వేలు కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 67 లక్షల మంది తల్లులకు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. నీకు 15, నీకు 15 అంటూ చేసిన ప్రచారంలో ఆశలు పెట్టుకున్న వారిలో 20 లక్షల మంది తల్లులకు సాయమందించలేదన్నది వాస్తవమన్నారు. సాయం చేయడమంటే ఏమిటో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకోవాలన్నారు. అధికారాన్ని చేపట్టగానే సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించారన్నారు. ముందుగానే తేదీ ఇచ్చి ఆ తేదీకి నేరుగా లబ్ధిదారుని ఖాతాకు పారదర్శకంగా జమ చేసేవారన్నారు. కూటమి పాలనలో వేలాది మంది ఎండీయూ నిర్వాహకులు, వలంటీర్లు వీధిన పడ్డారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్యబాబు, శెట్టి నాగేశ్వరరావు, ,కౌన్సిలర్లు, సాధనాల శివభగవాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

రక్తదానం చేయడం సామాజిక బాధ్యత


రక్తదానం చేస్తున్న దాతలను అభినందిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. మండపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి పర్యవేక్షణలో ప్రపంచ రక్తదాన దినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రక్తం అవసరమైనప్పుడు బాధిత కుటుంబాల వారు తీవ్రమైన మానసిక బాధలను అనుభవిస్తున్నారని, అవసరాలకు తగిన స్థాయిలో రక్తనిల్వలను ఉంచడం సామాజిక అవసరంగా పరిణమించిందన్నారు. రక్తదానం చేసినవారిని నిర్వాహకులు, అతిధిలు అభినందించారు. తమ పిలుపునకు స్పందించి ముందుకు వచ్చినవారికి ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధాకుమారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మండపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 2, 3, 8, 11, 12, 23, 27, 29, 30 వార్డులలో రూ.2 కోట్ల బీపీఎస్ నిధులుతో రహదారులు, డ్రెయిన్లు నిర్మాణ పనుల ప్రారంభానికి కొబ్బరికాయకొట్టారు.

మున్సిపల్ సాధారణ నిధులు రూ.1.05 కోట్లు వ్యయంతో 25వ వార్డులో విజయదుర్గ గుడి వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం, 26వ వార్డులోని ముస్లిం షాదీఖాన మొదటి అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో కమిషనర్ రంగారావు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ తోట

- ఆక్రమణలను అడ్డుకోవడంలో కమిషనర్ నిర్లక్ష్యం
- కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారు
- వాడీ వేడిగా మండపేట కౌన్సిల్ సమావేశం
- పలు తీర్మానాలు ఆమోదం


మండపేట కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


చర్చను నడుపుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన స్థలాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి కాపాడటంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ వర్క్స్ సమీపంలోని మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ప్రైవేటు వ్యక్తి ఏకంగా గోడను నిర్మించడాన్ని ఆయన ఉదహరించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 16 అంశాలతో కూడిన అజెండాను కమిషనర్ టీవీ రంగారావు చదివి వివరించారు. అనంతరం చైర్‌పర్సన్ నూక దుర్గారాణి అంశాలు వారీగా చర్చను జరిపారు.

ఎమ్మెల్యేగా ఏం చేస్తున్నారు.?

ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. పట్టణంలోని వాటర్ వర్క్స్ సమీపంలోని 18 సెంట్లు మున్సిపల్ స్థలం ప్రైవేటు వ్యక్తి అన్యాక్రాంతం చేస్తుంటే ఎమ్మెల్యే పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఈ విషయమై తాను గత మూడు కౌన్సిల్ సమావేశాల్లో అప్రమత్తం చేస్తున్నప్పటికీ కమిషనర్ రంగారావు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటు వ్యక్తి తొలగించిన చోటనే తిరిగి గోడను కట్టి ఆక్రమణకు పాల్పడ్డాడన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తి ఆక్రమించిన స్థలం తాలూకు పూర్వాపరాలను వివరించారు. ఆ స్థలం కచ్చితంగా ఆక్రమనే అని ఒక ప్రైవేటు వ్యక్తి మున్సిపల్ అధికారులను ఖాతరు చేయడంలేదంటే కూటమి పాలనా తీరును అర్థం చేసుకోవచ్చన్నారు.

కమిషనర్‌పై ఆగ్రహం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన నిధులను రద్దు చేశారంటూ టీడీపీ సభ్యులు చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ ఖండించారు. భవన నిర్మాణానికి నిధులు ఎప్పుడు కేటాయించారో తేల్చాలని పట్టుబట్టడంతో రికార్డులను వెతకగా 2021 లోనే నిధులు మంజూరు చేశారని, టెండరు సమస్య రావడంతో పనులు నిలిచిపోయాయని కమిషనర్ టీవీ రంగారావు వెల్లడించారు. ఎమ్మెల్సీగా ఉన్న తన పేరు కింది భాగాన వేయడంపై ఆయన ప్రశ్నించారు. చైర్‌పర్సన్ దుర్గారాణి అంశాలు వారీగా చర్చను నడపగా పలు తీర్మాణాలను కౌన్సిలర్లు ఆమోదించారు.

నిధుల కేటాయింపు

7వ వార్డు బురుగుంట చెరువు వద్దగల డా.వైఎస్సార్ మెమోరియల్ మున్సిపల్ పార్క్ సమీపంలోని 1450 కేఎల్ సామర్థ్యంగల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ డోమ్ కూలిపోవడంతో మరమ్మతు పనులు అత్యవసరం అయిన నేపథ్యంలో పురపాక సంఘం సాధారణ నిధులు రూ.27 లక్షలను ముందస్తు ఉత్తర్వులను ర్యాటిపై చేస్తూ తీర్మాణం చేశారు. 2025–26 బడ్జెట్‌లో నీటి సరఫరా నిర్వహణ పంప్ హౌస్‌రిపేర్, హెడ్ వాటర్ వర్క్స్ నిర్వహణ నిమిత్తం కేటాయించిన రూ.20 లక్షలకు బడ్జెట్‌కు అదనంగా మరో రూ.7 లక్షను రివైజ్డ్ బడ్జెట్‌లో పొందుపర్చామని అధికారులు తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను మున్సిపల్ ప్రజారోగ్య విభాగానికి అవసరమైన కన్సర్వెన్సీ సామాగ్రిని సరఫరా చేసేందుకు రూ.5,22,776తో దాఖలైన టెండర్‌ను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు రైతు బజారు వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.38,39,224తో దాఖలైన టెండర్‌ను అమోదించారు. తీర్మానాలను సకాలంలో కార్యాచరణలోకి తీసుకురావాలని అధికారులను చైర్‌పర్సన్ దుర్గారాణి ఆదేశించారు.

విమాన ప్రమాదం కలచివేసింది

కపిలేశ్వరపురం (మండపేట): అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పెద్ద సంఖ్యలో మృత్యువాత పడటం పట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ చేపట్టాలని, మానవత్వ కోణంలో మృతుల కుటుంబాలకు తగిన సాయం చేయాలని ఎయిర్ ఇండియా సంస్థ యాజమాన్యాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని తోట కోరారు.

నాయకుల స్పందన

ప్రమాద ఘటన తనను ఎంతగానో కలచివేసిందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి విచారాన్ని వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల సంఘం చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కామన ప్రభాకరరావు తదితరులు విమాన ప్రమాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

కపిలేశ్వరపురం: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని మలేరియా మాసోత్సవ ప్రచార కార్యక్రమంలో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎన్‌డీ రత్నకుమారి అన్నారు. ఆమె పర్యవేక్షణలో శుక్రవారం పడమర ఖండ్రికలో మలేరియా, డెంగ్యూ వ్యాధుల ప్రభావాలపై ప్రచారం చేశారు. హెల్త్ అసిస్టెంట్ వెన్నేటి వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం దేవి, ఆశ కార్యకర్తలు కె.సుజాత, వై.వరలక్ష్మి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి ఎస్. వెంకటేశ్వరరావు ఆదేశాలపై ఈ నెల ఒకటి నుంచి నెలాఖరు వరకూ మలేరియా మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనాఫిలస్ దోమ ద్వారా మలేరియా, ఏడిస్ దోమ ద్వారా డెంగ్యూ వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాలను దోమలు ఆశించకుండా కాపాడుకోవాల్సిన అంశాలపై ప్రచారం చేస్తున్నామన్నారు.

లక్షణాలను త్వరితగతిన గుర్తిస్తే మేలు

కపిలేశ్వరపురం: కేన్సర్ వ్యాధి లక్షణాలను త్వరితగతిన గుర్తిస్తే ప్రాణాంతక పరిస్థితి నుంచి కాపాడుకోవచ్చని సంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.పృధ్వీరాజ్ అన్నారు. అంగరలో శుక్రవారం కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (పీఎంపీ) వెల్ఫేర్ అసోసియేషన్ కపిలేశ్వరపురం మండల కమిటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి అవగాహన సదస్సును నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో డా.పృధ్వీరాజ్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, గుర్తించే పద్ధతులు, నిర్ధారణ పరీక్షలు, ఆధునిక చికిత్సా వంటి అంశాలపై పీఎంపీ వైద్యులకు అవగాహన కల్పించారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

రాయవరం: మండలంలోని పసలపూడిలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ దాడిలో సత్తి వెంకటరెడ్డి(రామవరం), నల్లమిల్లి నానిరెడ్డి, కొవ్వూరి సుబ్బారెడ్డి, కర్రి ప్రసాదరెడ్డి, సలాది పుల్లయ్య (పసలపూడి)లను పేకాడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.22,800 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. ఎవరైనా చట్టావ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.